క్లుప్తంగా

వినాయకుని సన్నిధిలో విజయహోమం నేడు


ద్విముఖ కల్యాణ వినాయకుడు

రాంబిల్లి : పంచదార్లలో ద్విముఖ కల్యాణ వినాయకుని సన్నిధిలో ఆదివారం పదో తరగతి విద్యార్థుల విజయహోమం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్న ఆకాంక్షతో వినాయకుని ఆశీస్సుల కోసం ఈ విజయహోమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ చైర్మన్ శ్రీరామ్మూర్తి తెలిపారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం


దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

రాంబిల్లి: పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఎస్.ఎస్.వి.ఎస్ రాజు అన్నారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై శనివారం దిమిలిలో ర్యాలీ నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చినమ్మలు పలువురు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ


మూలపేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక:మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఎస్ఐ పి.ప్రసాదరావు పరిశీలించారు.త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్ఐ ప్రసాదరావు మూలపేట,గంగాదేవిపేట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటు వేసేందుకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

మురుగుతో అవస్థలు


దిమిలి పల్లపువీధిలో రోడ్డుపై మురుగు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో గల పల్లపువీధిలో రోడ్డుపై మురుగు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పెడుతున్నారు. మురుగు పోయే మార్గం లేక ఇక్కడ రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని, మరోపక్క దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెల్లం పులుపు ధ్వంసం

పాయకరావుపేట: మండలంలోని ఈదటం గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 900 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడిచేశామని, నిందితులు పరారయ్యారని చెప్పారు. పులుపును ధ్వంసం చేసి, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.

5న బీసీ డిక్లరేషన్

మునగపాక : ఈ నెల 5న మంగళగిరిలో బీసీ డిక్లరేషన్ సభ జరుగుతుందని టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు.

రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం నుంచి పరీక్ష రాసి వస్తున్న ఇంటర్ విద్యార్థులు


పరీక్షలకు హాజరవుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

యలమంచిలి రూరల్: ఇంటర్మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం రెండోరోజు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల,కొక్కిరాపల్లి గురుకుల జూనియర్ కళాశాలల్లో సెకండ్ లాంగ్వేజ్ తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను సిటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నట్టు పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు రెండు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట : ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం నుంచి పరీక్షలు ప్రారంభమైనట్టు కళాశాలల అధ్యాపకులు తెలిపారు. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 569 మంది విద్యార్థులు, కార్తికేయ జూనియర్ కళాశాల్లో 369 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్నట్టు ఆయా కళాశాలల అధ్యాపకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు నుంచి 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నారు.

అభివృద్ధి పనులకు కార్పొరేట్ సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


వితరణగా అందించిన పొక్లెయిన్

రాంబిల్లి: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధులను కంపెనీలు కేటాయించడం అభినందనీయమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. శనివారం ఐవోసీఎల్‌లో వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పైపులైన్ టెర్మినల్ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రూ 26 లక్షలు విలువైన పొక్లెయిన్‌ను ఐవోసీఎల్ యాజమాన్యం వితరణ చేయడం అభినందనీయమని, దీనిని యలమంచిలి మున్సిపాలిటీలో వినియోగిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఏషియన్ పెయింట్స్, ఐవోసీఎల్ వంటి పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొన్నారు.

మంగవరంలో సప్తాహం


మంగవరంలో ప్రారంభమైన సప్తాహం

పాయకరావుపేట : మంగవరం గ్రామంలో 29 వ సప్తాహం శనివారం ప్రారంభించారు. రెండవ తేదీ నుంచి 8 వ తేదీ వరకు 7 రోజుల పాటు రాత్రి, పగలు నిరాంతరాయంగా సప్తాహం నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన భజన కళాకారులు బృందాలుగా మంగవరం గ్రామం వచ్చి సప్తాహంలో పాల్గొంటారు. ఈ నెల 8 వ తేదీన మహాశివ రాత్రి వరకు జరిగే ఈ సప్తాహం మంగవరం గ్రామంలో 29 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు.

మై హోమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


విద్యార్థులకు మందులు అందజేస్తున్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

యలమంచిలి : మై హోమ్ ఇండస్ట్రీస్ ద్వారా గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని మైహోమ్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజరు బి.రామస్వామి అన్నారు. ములకలాపల్లి సిమెంట్ కర్మాగారం మైహోమ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం ఏటికొప్పాక గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్యనిపుణులు డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ ప్రియ, డాక్టర్ నరేష్ సుమారు 634 మంది విద్యార్థినీ విద్యార్థులకు వివిధ రకాల కళ్ల పరీక్షలు, విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ శాతం, దంత పరీక్షలు, గైనిక్ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మైహోమ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని, మండలంలో మైహోమ్ ఇండస్ట్రీస్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మైహోమ్ ఫ్యాక్టరీ సీనియర్ డీజీఎం శ్రీనివాసరావు, డిస్పెన్సరీ సీనియర్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల కేలండర్ ఆవిష్కరణ


నాయీ బ్రాహ్మణ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నాయీ బ్రాహ్మణుల కేలండర్‌ను ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు గణేశ్, నూకరాజు, శివ, సింహాచలం, రాజాన రాజు, బయ్యవరపు మణి పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలి


కంబాల జోగులును అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలో గల రాజీవ్ నగర్ కాలనీలో పార్టీ కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ సూర్యనారాయణ పార్టీ కార్యకర్తలను కంబాల జోగులకు పరిచయం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావును, సమన్వయకర్త కంబాల జోగులును కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, పంచాయితీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మండలంలోని ఉమ్మలాడ, గంటవానిపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో గుమిగూడి ఉండడం, గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కవ్వింపు చర్యలకు ఎవరైనా దిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


గొడిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : పల్స్‌పోలియో నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు అందరూ సహకరించి విజయవంతం చేయాలని గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుకన్య కోరారు. ఆదివారం మండలంలో అన్ని గ్రామాల్లోను పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో 6153 మంది చిన్నారులకు 260 కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేసే కార్యక్రమం ఆదివారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంపై గొడిచర్ల పీహెచ్‌సీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

యలమంచిలి రూరల్ : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. శనివారం అంతర్జాతీయ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణ, వాటి మనుగడ ఆవశ్యకతపై అవగాహన కల్పించడానికే ప్రతి ఏటా ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆడారి అర్జున అప్పారావు మాట్లాడుతూ భూమి మీద ఎన్నో రకాల జీవజాతులు అంతరించిపోతున్నాయన్నారు. వాటిని కాపాడుకుంటేనే జీవ వైవిధ్యం సాధ్యమౌతుందన్నారు.

రీ-సర్వేలో లోపాల సవరణకు అవకాశం

మునగపాక : రీ-సర్వేలో లోపాలను సరి చేసుకోవాలని తహసీల్దార్ బి.పాపారావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూలపేటలో జరుగుతున్న రీ-సర్వే లోపాల సవరణ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని చోట్ల రైతులకు సంబంధించిన పట్టాదారు పుస్తకాల్లో భూముల నమోదులో తేడాలున్నట్లు గుర్తించామని వాటిని సవరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


సంతోష్ కుమార్ (ఫైల్)

యలమంచిలి రూరల్: రైలు నుంచి జారిపడి విశాఖ జిల్లా గాజువాకకు చెందిన గజగంటరావు సంతోష్ కుమార్(36) అనే వ్యక్తి మృతి చెందినట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ మీడియాకు తెలిపారు. రైల్వే గ్యాంగ్‌మేన్ సమాచారం మేరకు శనివారం ఉదయం రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి తుని రైల్వే పోలీసులకు తెలియజేశారు.ఈ మేరకు తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుని శరీర భాగాలు తెగిపడి గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. మృతదేహం వద్ద లభించిన ఆధారాలనుబట్టి మృతుడు గాజువాక ప్రాంతానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు.అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతి చెందిన సంతోష్ కుమార్ వెల్డింగ్ పని చేస్తూంటాడు.ఈ క్రమంలో ఉపాధి నిమిత్తం వారం రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రానికి వెళ్లాడు.అనారోగ్యంతో తిరిగి ఇంటికి వస్తుండగా యలమంచిలి నర్సింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు. సమాచారాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేశామని రైల్వే ఎస్సై తెలిపారు.కేసును దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఒత్తిడి లేకుండా టెన్త్ పరీక్షలు రాయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

అచ్యుతాపురం : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా సన్నద్ధం కావాలని డీఈవో వెంకట లక్ష్మణమ్మ పిలుపునిచ్చారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె శనివారం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మంచి ఆహారాన్ని తీసుకొని ఎటువంటి భయం లేకుండా శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చదవాలని ఆకాంక్షించారు. మధ్యాహ్న భోజన పథకం తీరుపై ఆరా తీశారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

అచ్యుతాపురం : తంతడి గ్రామంలో పునఃనిర్మించిన శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, వాస్తు మండపారాధన, విగ్రహాల సంప్రోక్షణ, వాస్తు హోమం జరిపించారు. ఆదివారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో కొల్లి అప్పారావు, చోడపల్లి సత్యం పాల్గొన్నారు.

మద్యం మత్తులో వంతన పైనుంచి పడి మృతి

పాయకరావుపేట: తుని కొండవారుపేటకు చెందిన గంపల అప్పారావు (50) రిక్షా కార్మికుడు. ఇతని భార్య గతంలోనే ఇతనితో గొడవ పడి వెళ్లిపోయింది. అప్పారావు శుక్రవారం రాత్రి తాండవ నది ఒడ్డున మృతి చెంది ఉన్నాడని, తాగిన మత్తులో వంతెన పైన నుంచి పడిపోవడంతో చనిపోయాడని ఎస్ఐ రామారావు తెలిపారు. మృతుడి సోదరుడు దేవుళ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పూడిమడక రోడ్డుకు శాశ్వత మరమ్మతులు

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజుకు అఖిలపక్ష సమావేశం కృతజ్ఞతలు


మాట్లాడుతున్న రోడ్డు పోరాట కమిటీ కన్వీనర్ సదాశివరావు

మునగపాక : పూడిమడక రోడ్డు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తీసుకున్న చొరవ అభినందనీయమని రోడ్డు పోరాట కమిటీ కన్వీనర్ సదాశివరావు అన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారి మరమ్మతుకు గురికావడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడాల్సి వచ్చిందన్నారు. దీంతో అఖిలపక్షం ఆధ్వర్యంలో పలు ఆందోళనలు నిర్వహించామన్నారు. రోడ్డు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.5 కోట్లు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఆయన చేసిన కృషి మరువలేమన్నారు. రహదారి పనులు ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు రామ్మోహనరావు, అఖిలపక్షం నేతలు మద్దాల కృష్ణ, పరశురామ్, అప్పారావు, వీవీ శ్రీనివాసరావు, మహేశ్వరరావు, బ్రహ్మాజీ, జగ్గారావు, ఆడారి శేఖర్ సమావేశంలో పాల్గొన్నారు.

‘మానవతా’ సంస్థ ఆధ్వర్యంలో శాంతి రథం


శాంతి రథం ప్రారంభించిన ప్రతినిధులు

పాయకరావుపేట : మానవసేవే ధ్యేయంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని, సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. జగతా అప్పారావు కల్యాణ మండపంలో మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సమావేశం శనివారం జరిగింది. సంస్థ ఆధ్వర్యంలో సమాజానికి అవసరమైన కొన్ని సేవల్ని పట్టణంలో ప్రవేశ పెట్టడానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సహకారం, రక్తదానం ఏర్పాట్లు, పర్యావరణ పరిరక్షణ, అంబులెన్స్ సేవలు, ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, శాంతి ర్యాలీల నిర్వహణ, శాంతి రథాలు, మార్చురీ ఫ్రీజర్లు కూడా సమకూర్చడం జరుగుతుందన్నారు. 2004లో జంగారెడ్డిగూడెంలో ప్రారంభమైన సంస్థ 13 జిల్లాల్లో 108 మండలాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం శాంతి రథాన్ని సంస్థ ద్వారా అంకితం చేశారు. ఈ సందర్భంగా సంస్థ నూతన కార్యవర్గం నియామకం జరిగింది. చైర్మన్‌గా బి.చినబాబు, డైరెక్టర్లుగా తోట నగేష్, గూటూరు శ్రీను, రాజుబాబు, కార్యవర్గ సభ్యులుగా టిక్కలి రామకృష్ణ, మొల్లేటి నారాయణ, వెంకటరమణ నియమితులయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, పాండురంగ దేవస్థానం మాజీ చైర్మన్ వరహాలు, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోవిందు కుటుంబ సభ్యులకు పరామర్శ


గోవిందు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సమన్వయకర్త కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం: కుటుంబంలో కష్టాలు వచ్చినప్పుడే మనోధైర్యంతో ముందుకు సాగాలని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రేవుపోలవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చోడిపల్లి గోవిందు కుటుంబ సభ్యులు ఇటీవల చోడిపల్లి నూకరాజు, లచ్చరాజు భార్యభర్తలు ఇరువురు రెండు రోజుల వ్యవధిలో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర దుఖంలో మునిగింది. సమాచారం తెలుసుకున్న సమన్వయకర్త కంబాల జోగులు శనివారం గోవిందు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్‌లు అనూరాధ, శ్రీనుబాబు,మండల యూత్ అధ్యక్షుడు వెంకటరాజు, వైస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, రమణ, దివాణం, రాజేష్ ఉన్నారు.

విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ సేవలు భేష్


బహుమతులు పొందిన విద్యార్థులతో ఎంపీపీ గోవింద్, ఎంఈవో మీనాక్షి, బాబ్జి తదితరులు

యలమంచిలి : విద్యార్థుల హక్కుల సాధనలో ఏఐఎస్ఎఫ్ ఎంతో కృషి చేస్తుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి నమూనా పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన శనివారం యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో మీనాక్షి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫణీంద్రకుమార్‌తో కలసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల హక్కుల కోసం పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పదో తరగతి విద్యార్థులు వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ పదో తరగతి నమూనా పరీక్ష నిర్వహించడం ద్వారా పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే


ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం : బడుగు,బలహీన వర్గాలకు చెందిన వారందరికీ ఇళ్లు నిర్మించడంతో పాటు, ఆయా కాలనీలను ఊళ్లుగా మార్చే బృహత్తర కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో శనివారం 900 మందికి ఇళ్ల పట్టాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. నియోజకవర్గం మొత్తంలో ఎటువంటి సిఫారసు లేకుండా అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్‌రావు, వడిశెల శ్రీనివాసరావు, జువ్వాల నాయుడు, తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి శనివారం విలేకరులతో మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. మండలంలో కనీసం రెండేళ్లు విద్య పూర్తి చేసిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఓసీ, బీసీల కు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 వంతున ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో నమో దు చేసిన దరఖాస్తును సంబంధిత మోడల్ స్కూల్లో అందజేయాలని శ్రీ లక్ష్మి కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎస్‌రాయవరం: జాతీయ రహదారి పక్కన అడ్డురోడ్డు సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ విభీషణ్‌రావు వివరాల ప్రకారం.. ఇక్కడ 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. అతడి శరీరంపై ఫ్యాంటు చొక్కా ఉన్నాయి. శరీరంపై గాయాలున్నాయి. మృతుడి సంబంధీకులు నక్కపల్లి లేదా ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.